# కుచ్చుల టోపి

"ఏ దివ్యలోకాలలో విహరిస్తున్నావో గానీ తల్లీ రైలొస్తూంది కాస్త నేలమీదకి దిగిరా" భుజం మీద ఒక్క చరువు చరిచింది మేరీ. అదిరిపడి లేచి ఒక చేత్తో వీపు తడుముకుంటూ మరోచేత్తో జిప్ బాగ్ అందుకుంటుండగానే చెవులు చిల్లులు పడేలా గోలపెడుతూ వచ్చి ఆగింది, ప్రయాణీకులపాలిట పుష్పక విమానమనదగ్గ ధూమశకటము! హడావుడి పడుతూ ముందుకు పరిగెట్టాము మేమిద్దరం. ఏ పెట్టెలో చూసినా కిట కిట లాడిపోతున్నారు జనం. ఆడకూతుళ్ళం అవస్థ పడుతున్నామన్న జాలైనా లేకుండా చోటులేదు పొమ్మన్నారు. రెండు మూడు పెట్టెలుదాటి, ఇక లాభంలేదని జబర్దస్తీగా ఎక్కబోయింది మేరీ. "చోటు లేదంటే వినిపించుకోవేంటమ్మా? మా తలమీద నిలబడతావా ఏం!" తన తాత సొమ్మేదో దోచుకుంటున్నామన్నట్టు అదిలించాడో బట్టతల ఆసామీ. గార్డు విజిల్‌వేసి జండా ఊపసాగాడు. ఎక్కవలసిన వాళ్ళు బోలెడు మందున్నా తిరుపతి వెస్ట్ స్టేషన్‌లో రైలు మాత్రం రెండు నిముషాలకన్న ఎక్కువ ఆగదు.

"నువ్వు వుండవయ్యా... రైలు కదలిపోతుంటే వాళ్ళ నెక్కడికి పొమ్మంటావ్?" టెర్లిన్ షర్టు వేసుకున్న ఒక బొగ్గుల బస్తా ఆపద్బాంధవుడిలా ఆదుకున్నాడు మమ్మల్ని మా చేతుల్లోని బాగ్స్ అందుకుని ఎలాగో చోటుచేసి మాకు కాలుమోపే సందిచ్చాడు. కృతజ్ఞతలు తెలుపుకుని తలుపుని పట్టుకుని నిలబడ్డాం. గొప్ప సాహసకార్యం చేసానన్న సంతోషంతో కాబోలు బొమ్మ విరుచుకొని మా వైపు వీపుచేసి మా రక్షణ కోసమన్నట్టు తలుపుకడ్డంగా నిలబడ్డాడు టెర్లిన్ షర్టువాలా, రైలు జెర్కు ఇచ్చినప్పుడల్లా అతగాడి విశాలమైన వీపును శరణుకోరడం తప్ప లేదు మాకు.

"ఇంటికెళ్ళి డెట్టాల్ నీళ్లతో స్నానం చెయ్యాలే పారూ -" నా చేతిమీద గిచ్చుతూ రహస్యంగా అన్నది మేరీ.

"అదృరేగానీ - ఇతగాడు స్నానం చేసిన నీళ్ళని స్టోర్‌చేస్తే మన దేశంలో సిరాకు కొఱత వుండదోయ్ -" అన్నాను నవ్వుతూ.

ఇంతలో ఏదో చిన్న స్టేషన్‌లో రైలాగడం మా అదృష్టం కొద్ది అక్కడ కొంత మంది దిగడం జరిగింది.

"మీరు లోపలికివెళ్ళి కూర్చోండి. ఈ సామాను నేను అందిస్తాను" అన్న అపద్బాంధవుని మాట ప్రకారం బుద్ధిగా లోపలివెళ్ళి కూర్చున్నాం. వెంటనే బాగ్‌లో నుండి పుస్తక మొకటి బయటకుతీసి, ఆ అరగంటా వృథాచేస్తే కొంపలంటుకు పోతాయన్నట్టు. రేప్పొద్దున్నే యూనివర్సిటీ పరీక్ష వ్రాయాలన్నంత దీక్షగా చదువుకోసాగింది మేరీ.

"ఏయ్ మొద్దూ మన రెడ్‌క్రాస్ నైట్ వెళ్ళిపోతున్నాడు చూడు -" బలవంతంగా మేరీ మొహాన్ని పైకెత్తి చెప్పాను - ఒక క్షణ కాలం అటువైపు చూసి నవ్వేసి "విషాదాంత చిత్రాలలో, నిండుమనసుతో అందర్నీ ఆశీర్వదించి, శూన్యంలోకి ప్రయాణం కట్టే కథానాయకుడిలా ఉన్నాడు కదూ పాపం - " అంది మేరీ కొంటెగా! గల గల నవ్వుకున్నాం కాసేపు.

"ఏఊరమ్మా మనది?" అన్న ప్రశ్నవిని ఉలికి పడ్డాను.

ఎదురు బెర్తుమీద కూర్చున్న ముసలాయన ముందుకు వంగి అడుగుతున్నాడు. ఆయన వయసు డెబ్భైకి పైగానే ఉంటుందేమో - జీవితం నేర్పిన పాఠాల్లా ఉన్నాయి మొహం మీది గీతలు. ముడుతలుపడి, పట్టు సడలి వ్రేలాడుతున్న చర్మం - సన్నగా, బలహీనంగా ఉన్నాడా వృద్ధుడు. ఎందుకో తెలియదు గానీ చాలా సౌమ్యంగా సమాధానం చెప్పాను. "అనంతపురం తాతా" అని.

మేరీ నాకేసి ఒకసారి చూసి 'మంచి కాలక్షేపమే' అన్నట్టు నవ్వి మళ్ళీ పుస్తక పఠనంలో మునిగిపోయింది.

"మనదే కులం తల్లీ?" ఇంకో ప్రశ్న.

"బ్రాహ్మణులం" అన్నాను.

"చూడగానే అనుకున్నానమ్మా - ఆ కళ, ఆ కాంతీ చూస్తుంటేనే తెలుస్తూంది - ఆ అమ్మాయి నీ చెల్లెలామ్మా?"

నాకు పక్కున నవ్వొచ్చింది. దృష్టి ఆనక మేరీ మొహాన బొట్టు లేక పోవడం గమనించని తాత కళా కాంతీ మాత్రం చూసాడు కాబోలు ననుకుంటే!

"కాదు తాతా! నా స్నేహితురాలు" అన్నాను నవ్వుతూనే -

"చదువుకుంటున్నారా?" అతి ప్రయాసమీద ముందుకు వంగి మాట్లాడుతున్న వాడల్లా 'అమ్మా, అంటూ మోకాళ్ళు పట్టుకుని బాధగా మూలిగాడతను.

"ఉద్యోగం చేస్తున్నాంగానీ ఆ కాలికేమయింది తాతా?" జాలిగా అడిగాను.

'దేవుణ్ణి చూద్దాం కదా అని కొండమీదికి వెళ్ళానా అక్కడ ఏ ఎదవో దారిలో పారేసిన అరటి పండు తొక్కమీద కాలేసి జారిపడ్డాను తల్లీ - కీలు తొలగిందో, ఎముక విరిగిందో, వాపుచేసి ఒకటే నొప్పి -" మూలుగుతూనే చెప్పాడతను.

"అయ్యో మరి డాక్టర్ని చూడలేదూ?"

"మన ఊరా మన చోటా తల్లీ అది? మాట్టాడించే వాళ్ళెవరు? అయినా ఈడాట్టర్లు బాగుచేయడం మాటెలా వున్నా కాలు తీసేస్తా మంటారు?"

"ఇంతకీ దేవుని దర్శనం చేసుకున్నావా తాతా?" ఇక డాక్టర్ల దుమ్ము దులుపుతాడేమోనని సంభాషణ మరోదానికి మళ్ళించాను.

"ఆ దేవుణ్ణీ దేవతల్నీ కూడ చూశాను తల్లీ -" నవ్వాడు.

"దేవతలెవరు తాతా?" నాకు నిజంగానే అర్థం కాలేదు.

"నేను కొండమీద కెళ్ళిన రోజే' సినిమా వాళ్ళంతా వచ్చారు. జమునో సావిత్రో ఎవరో నీలాగే వుంది తల్లీ - నేను కిందపడ్డం చూసి కుర్రాళ్ళంతా నవ్వుతుంటే వొచ్చి చెయ్యి పట్టిలేపి 'జాగ్రత్తగా వెళ్ళు తాతా' అంది కూడా ... సగర్వంగా చెప్పాడు తాతా.

చదువుకుంటున్నదల్లా పుస్తకం మూసిపెట్టి 'ఏవిటో సంగతి - తైరు కొడుతున్నాడోయ్ నీకు!" మెల్లిగా గొణిగింది మేరీ.

"తైరు కాదుగదా గాలికొట్టినా సావిత్రంతకానులే నేను -" దాని తలమీద ఒక మొట్టికాయ వడ్డించి తాతకేసి తిరిగాను.

"ఇంతకీ వాళ్ళు నీకు తెల్సినవాళ్ళా తాతా?"

"ఆ వీళ్ళు కాదుగానీ సినీమాలో ముసలి ఏసాలేసేనాగయ్య మా ఊరివాడే - చిన్నప్పుడూ మా తోటలో మావిడికాయలు కోసుకుపోయేవాడు. నేనేవన్నా అంటే "బాపనోళ్ళకు మనం పిలిచి పెట్టాల్రా - అరినేమనబోకు" అనేది మా అమ్మ. వాడు మద్రాసెళ్ళాక నన్నెన్నోసార్లు పిలిచాడు వాళ్ళింటికి రమ్మని -".

"మరి వెళ్ళావా తాతా? చక్కగా స్టూడియోలు అవీ చూపించే వాడుగా' అన్నాను.

"ఒకరింటికెళ్ళె కరమ మనకేం తల్లీ? ఒకరికిపెట్టె జాతకమే గానీ చేయించుకోవడ మెఱగము మేము -" సత్యభామకంటే స్వాతి శయం కనిపించింది తాత మాటలలో.

ఇంతలో రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది. చిడతలు వాయిస్తూ, "చెల్లాయి పెళ్ళి కూతురాయనె" అంటూ కర్ణ కఠోరంగా పాడుతూ పెట్టెలో కెక్కేడు ఒక బిచ్చగాడు.

"గుడ్డివాడిని తల్లీ - ధరమం చేయండమ్మా - అంటూ విరిగిపోయిన గ్రామఫోను ప్లేట్‌లా రొద చేయసాగాడు. నాకు చిరాకనిపించి గట్టిగా కసిరాను. "అరవకుండా ఆ వైపుకుపో - ఇక్కడెవరూ చిల్లర రాసిపోసుక్కూర్చోలేదు." అంటూ..

"ఎందుకలా మండి పడతావ్? ఓ రెండు పైసలు వేస్తే పోలా! పుస్తకంలో నుండి తలెత్తకుండానే అంది మేరీ.

"ఆ అంతా దొంగ వేషాలు - వాడు ఈ రోజు గుడ్డివాడినంటూ వస్తాడు - రేపు కుంటివాడిగా అవతారమెత్తుతాడు! అన్నాను.

"మా బాగా చెప్పావమ్మా - ఒళ్ళొంచి పనిచేసుకోలేక అడుక్కుతింటానికి బయల్దేరుతారు -" తాతా నన్ను సమర్థించాడు.

'ఇంతకీ నీపేరేమిటి తాతా?' మళ్ళా తాతతో మాటల్లో పడ్డాను.

'రంగయ్యంటా మ్మా! - నన్నెరగని వాళ్ళు మా ఊరు మొత్తంలో లేరులే. వొందల ఎకరాలున్న సోమిరెడ్డిగారు కూడా నన్ను చూస్తే 'బావున్నావా రంగయ్య తాతా' అని లోపలికి పిలిచి కాఫీ యిచ్చి 'మా యింటి దీపం వెలిగించావు తాతా! నీమేలు మర్చిపోను అంటాడు - 'చుట్టతీసి కొస కొరికి వెలిగించి ఒక దమ్ము లాగి తన్మయంగా కళ్ళు మూసుకున్నాడు తాత.

'ఆయనకు నువ్వేం ఉపకారం చేశావు తాతా?' కుతూహలంగా అడిగాను.

'అబ్బో, మంచి సస్పెన్సు పెట్టేడే తాతా! డిటెక్టివ్ కథలు చదువుతాడా ఏమిటి?' గొంతు తగ్గించి అంటూ కళ్ళెగరేసింది మేరీ.

"నోర్మూసుకొని బుద్ధిగా చదువుకో' దాన్ని గట్టిగా కోప్పడి, ఇక మొదలు పెట్టమన్నట్టు తాతవైపు చూశాను.

'లక్ష్మీదేవివంటి ఆయన భార్య బిడ్డనుకని పురిట్లోనే వెళ్ళిపోయింది. 'ఈ పిల్లలతో నేనేం చేసేది తాతా' అంటూ గోలపెట్టేడు. ఇంటిలో ఆడదిక్కు కావాల మళ్ళీ పెళ్ళి చేసుకొమ్మంటే 'ఈవయసులో నాకెవరు పిల్లనిస్తారు తాతా? నా యింటి దీపం వెలిగించే భారం నీదే' నంటూ చేతులు పట్టుకు బ్రతిమలాడేడు.

సినిమాలో ఫ్లాష్ బాక్ చూపించినట్టు, గతం అతని కళ్ళముందు కదులుతూందో ఏమో, తాత ఎటో చూస్తూ చెప్పుకుపోతున్నాడు. మేరీ కూడ పుస్తకం మూసేసి శ్రద్ధగా వింటూంది.

'ధర్మవరంలో మాకు తెల్సిన వాళ్ళున్నారు. కలో గంజో తాగి గుట్టుగా గడుపుతున్నా ఇరవైయేళ్ళొచ్చిన ఆడపిల్లకు పెళ్ళి చేయలేక పోతినే అని దిగులుతోనే మంచంపట్టేడాయన.

కట్టుకోను బట్టకూ, తినడానికి తిండికీ కొఱతలేని సంబంధమని చెప్పి పిల్లకు నచ్చజెప్పి పెళ్ళి జరిపించాను. అందుకే సోమిరెడ్డిగారికి నేనంటే అంతగవురవం. ఆయన వయసు యాభైదాటితేనేం గాక పిల్ల సుఖపడుతూంది -' అంటూ ఏదో గుర్తొచ్చినట్టు చటుక్కున అడిగాడు తాత.

'నీకు మనువైందామ్మా?'

'చచ్చాంరాదేవుడా!' అనుకుంటూ "ఇంకాలేదు తాతా - ఉద్యోగం చేస్తున్నాగా" అంటూ నాన్చేసాను.

'అయితే మాత్రం ఎన్నాళ్ళు చేస్తారమ్మా? ఏ వయసులో ఆ ముచ్చటన్నారు సంబంధాలు చూస్తున్నారా? నా ఎరికలోనే చదువుకుని మంచి ఉద్యోగాలు చేస్తున్న కుఱ్ఱాళ్ళిద్దరున్నారు - బ్రాహ్మలే - మీ వాళ్ళు కట్నమిస్తారా తల్లీ?'

'కొరివితో తలగోక్కున్నట్టయిందే భగవంతుడా' అనుకుంటుంటే మేరీ నా భుజం నొక్కుతూ 'ఇంకే తొందర్లోనే మాకు పప్పన్నం పెడతావన్న మాట ... ఎటొచ్చి ఏ రెండో పెళ్లి వాడినో చూస్తాడేమో బద్రం చిట్టి తల్లీ -' అంటూ గొణిగింది. మేమిద్దరం ఇంగ్లీష్‌లో మాట్లాడుకోవడం వలన తాతకేమీ అర్థం కాలేదు.

'ఏవమ్మా - ఏవిటంటున్నారు? దగ్గిరి వాళ్ళెవరేనా ఉన్నారా?' అంటూ ఆరా తీసేడు.

'అమ్మయ్య' అనుకుంటూ 'మా బావే ఉన్నాడు తాతా -' కాస్త సిగ్గుపడడానికి ప్రయత్నిస్తూ అన్నాను.

'చెప్పవేం తల్లీ? అందుకే నీకప్పుడే పెళ్ళికళ వచ్చేసింది -' అన్నాడు ఉన్న రెండుపళ్ళూ కనపడేట్టు నవ్వుతూ.

మేరీ విసుగ్గా వాచీకేసి చూసుకుని ఆవలించింది 'మరీ నత్తనడకలు నడుస్తుందేం ఈ బండి? అయినా ఇంత ఖర్చుపెట్టే మన యూనివర్సిటీ వారు తిరుపతి నుండి అనంతపురంకు ఒక ఎక్స్‌ప్రెస్ రన్‌చేస్తే బావుండును -'.

'పాకాల చేరడానికి ఇంకెంత సేపుందమ్మా?' తాత మేరీ నడిగాడు.

'పదిహేను నిముషాలు తాతా' అంటూ 'నువ్వెక్కడ దిగుతావు?' అనడిగాను.

'పాకాలలోనే దిగాలమ్మా - అక్కడికి నాలుగు మైళ్ళుంది మా పల్లె. మీరు అక్కడ దిగి రైలు మారతారుగా - ఒకపూట మా యింటికి వచ్చి పొండమ్మా - బెల్లం పచ్చులూ, వేరు సెనక్కాయలూ యిస్తాను పట్టుకుపోదురుగానీ -' అన్నాడు తాత.

'ఇంకెప్పుడేనా వస్తాంలే తాతా' అన్నాను. 'రాత్రి ఆదమరచి నిద్రపోయేరు తల్లీ! కాలం బాగలేదు - పాకాలలో కాస్త పండో ఫలహారమో తీసుకుని మరీ వేరే బండెక్కండి -' ఆప్యాయంగా అన్నాడు తాత.

'అలాగేగానీ ఇంత రాత్రివేళ మీ పల్లెకు ఎలా వెడతావు తాతా?' సందేహంగా అడిగాను.

'ఇక్కడ తోలు బొమ్మలాట లేస్తున్నారమ్మా - ఈ రాత్రిక్కడే వుండి తెల్లారి బయల్దేరతాను. చేతిలో చూస్తే డబ్బంతా అయిపోయిందికదా, తెల్సిన వాళ్ళయినాలేరు - రాత్రికిన్ని నీళ్ళు తాగి పడుకోవాల్సిందే - మన బోటి వాళ్ల నడగడానికి మనసొప్పదు గదా - మీ బోటి వాళ్లకు రూపాయి, అర్థా, లెక్కలేదనుకోమ్మా - అయినా అడగాలంటే ప్రాణం చచ్చిపోతుంది! చూసావూ-'

'అయ్యో దానికేం తాతా? ఉత్త కడుపుతో ఎలా పడుకుంటావు?' అంటూ పర్స్‌తీసి రూపాయినోటు తీసి అందించాను.

'మాతల్లీ! నీ అమ్మ కడుపు చల్లగా నూరేళ్ళు బ్రతుకు తల్లీ' వణుకుతున్న చేతులతో ఆ నోటు అందుకున్నాడు తాత.

ఇంకా సిగ్నల్ ఇవ్వలేదు కాబోలు స్టేషనుకు కాస్త దూరంలో ఆగిపోయింది రైలు. తాత మూటతీసుకుని 'మరి నేనొస్తానమ్మా - నీమేలు మర్చిపోను-' అంటూ దిగిపోయాడు.

'అరె - ఇంకా స్టేషన్ రాదులే తాతా! కాస్తాగు ఈ చీకట్లో దారి తెలీదు -' అంటుంటే మేరీ నానోరుమూసింది 'అతగాడు టికెట్ తీసుకున్నాడనుకుంటున్నావా? లేక టికెట్ కలెక్టర్ నీవంటి వెంగళాయనుకుంటున్నావా? రూపాయి వదిలించుకుని కుచ్చుటోపీ పెట్టించుకున్నావుగా - ఇహ ఊరుకో!' అంటూ.

రైలు దిగి కుంటుకుంటూ వెళ్తున్న తాతవైపు తెల్లబోయి చూస్తూ ఉండిపోయాను.

**శారదా పత్రిక**

తేది : 15-8-1971